

విలేకరుల సమావేశంలో ఐజీపీ లోకేష్ కుమార్, ఎస్పీ శోభారాణి

రూ.18 కోట్ల డిజిటల్ మోసాలు

- బళ్లారి జిల్లాలో రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- ప్రజలు అప్రమత్తంగా ఉండకపోతే నష్టపోతారు
- కొత్త నంబర్ నుంచి కాల్ వస్తే జాగ్రత్త
- డిజిటల్ అకౌంట్‌లో అధిక మొత్తం ఉంచరాదు..

బళ్లారి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏడాది కాలంలో రూ.18 కోట్ల సైబర్ అక్రమాలకు పాల్పడ్డారని ఐజీపీ లోకేష్ కుమార్ హెచ్చరించారు. నకిలీ పోలీసుల ముసుగులో కొందరు మోసగాళ్లు సెల్‌ఫోన్లలో డిజిటల్ ఆరెస్టు చేసి మోసం చేస్తున్నారని, అలాంటి మోసగాళ్ల నుంచి జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిజిటల్ అరెస్టు దారులు ముందుగా మీ అడ్రస్సు, సెల్‌పోన్లు నంబరు సేకరించి కాల్ చేస్తారని, తాము పోలీసులని, ఇదిగో మా పక్కనే సీబీఐ ఆఫీసర్ కూడా ఉన్నాడు అని అనుమానం రాకుండా వీడియో కాల్‌లోకి రావాలని డిజిటల్ అరెస్టుకు పాల్పడతారన్నారు. ప్రముఖ వ్యక్తులు, వ్యాపారులు, ఉద్యోగులను టార్గెట్ చేసి డిజిటల్ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల జరిగిన డిజిటల్ మోసాన్ని ఐజీపీ వివరించారు. బెంగళూరులో ఒక ఉద్యోగిని డిజిటల్ అరెస్టు చేశారని టార్గెట్ చేసి ఏకంగా రూ. కోటి వరకూ ఆన్‌లైన్ అకౌంట్‌లో వేయించుకున్నారని తెలిపారు. మీ అకౌంట్‌లో ఎంత మొత్తం ఉండేది. అది మీకు ఎలా వచ్చింది. అన్నీ మాకు తెలుసు అని పోలీసుల పేరుతో భయపెట్టి డిజిటల్ అరెస్టు చేసి నగదు మొత్తం ఖాళీ చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ అకౌంట్‌లో పరిమితి నగదు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. మోసం జరిగిందని తెలియగానే వెంటనే 1930 నంబర్‌కు పోన్ చేయాలని తెలిపారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి లింకులు ఓపెన్ చేయరాదని, ఖాతాలో సొమ్ము పోతే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరు ఫోన్ చేసినా ఓటీపీ చెప్పరాదన్నారు. విలేకరుల సమావేశంలో ఐజీపీతో పాటు ఎస్పీ శోభారాణి, ఏఎస్పీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సిద్ధహస్తుడు..!

- రూ.4 లక్షల కోట్ల బడ్జెట్‌కు సీఎం కసరత్తు
- 16వ సారి ప్రవేశ పెట్టనున్న సిద్దరామయ్య
- పలు శాఖల అధికారులతో సమీక్ష
- మూడు రోజులుగా వరుస సమావేశాలు



బడ్జెట్ బ్యాగ్‌తో సీఎం సిద్దరామయ్య (ఫైల్)

బెంగళూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య మరోసారి బడ్జెట్‌కు రూపు దిద్దుతున్నారు. పలు మార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టి రికార్డు సృష్టించిన ఘనత ఆయనదే. కొత్త ఏడాది ప్రారంభమైంది. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఇంకా నెల రోజుల సమయం ఉంది. అయితే అప్పుడే బడ్జెట్‌పై చర్చలు జోరందుకున్నాయి. 2025-26 ఆర్థికసంవత్సరం బడ్జెట్ తయారీ ప్రక్రియకు సీఎం సిద్దరామయ్య ఇప్పటికే శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో అత్యధికసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డును సిద్దరామయ్య నమోదు చేయనున్నారు. దీంతోపాటు రాష్ట్ర బడ్జెట్ గాత్రం కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. సిద్దరామయ్య ఫిబ్రవరిలో 16వ బడ్జెట్‌ను 4 లక్షలకోట్లకుపైగా ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నారు. ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 3.71 లక్షల కోట్ల మేర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. రానున్న ఆర్థిక సంవత్సరంలో మరో రూ.30వేలకోట్లకుపైగా పెరిగి రూ.4లక్షల కోట్లకు చేరనుంది. భారీ బడ్జెట్‌లు ప్రవేశపెట్టడంలోనూ సిద్దరామయ్య ఓ అడుగు ముందుకేసినట్లు అనిపిస్తోంది. సొంత పన్నులు పెంచుకోవడంతోపాటు కేంద్రం నుంచి రాష్ట్రానికి కేటాయించిన గ్రాంట్లు, సహాయధనం పెంచుకోవడం ద్వారా భారీ బడ్జెట్‌కు వ్యూహం సిద్ధం చేస్తున్నారు. 2024-25లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం సొంత పన్నుల మూలాలైన వాణిజ్య పన్నులు, అబ్కారీ, రిజిస్ట్రేషన్‌లు, రవాణాశాఖల ద్వారా పన్నుల ద్వారా ఆదాయంతోపాటు ఇతర ఆదాయాల రూపం 1.89 లక్షలకోట్లకు అంచనా పెట్టుకున్నారు. సాధారణంగా ఏడాది నుంచి ఏడాదికి పన్నుల ప్రమాణం పెరుగుతుంది. అందుకు అనుగుణంగానే రానున్న సంవత్సరంలో 10 శాతం ఆదాయం పెంచుకోవాలని భావిస్తున్నారు. 18వేల నుంచి 19వేల కోట్ల రూపాయలు ఆదాయం పెంచుకోగలిగితే మొత్తం పన్నుల రూపంలో ఆదాయం రూ.2.10 లక్షలకోట్లకు పెరిగే అవకాశం ఉంది. కర్ణాటక దేశంలోనే రెండో అతిపెద్ద జీఎస్టీ సేకరించే రాష్ట్రంగా కొనసాగుతోంది. రాష్ట్రంలో జీఎస్టీ సేకరణ ప్రమాణం 2024-25 సంవత్సరంలో 15శాతం ప్రగతి సాధించింది. జాతీయ ప్రగతి 10శాతం ఉండగా అంతకంటే 5శాతం ఎక్కువగా రాష్ట్రంలో జీఎస్టీ సేకరణ సాధ్యమయ్యింది. జీఎస్టీ ప్రగతి పెరిగిన మేర కేంద్రం నుంచి రాష్ట్రానికి పన్నులవాటా లభించనుంది. 2023-24 సంవత్సరంలో కేంద్ర పన్నులవాటా 37,252 కోట్ల రూపాయలు లక్ష్యంగా పెట్టుకోగా 40,280 కోట్ల రూపాయలు సాధ్యమైంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 44,485 కోట్ల రూపాయలుగా అంచనా వేశారు. 2025-26లో కేంద్ర పన్నులవాటాలో కర్ణాటకకు 52వేల కోట్ల రూపాయలు కేటాయించవచ్చునని తెలుస్తోంది.

కేంద్ర సాయం పెరిగే అవకాశం

2023-24 సంవత్సరంలో కేంద్రం రూ.13,005 కోట్ల సహాయధనం విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.15,299 కోట్లు సహాయధనం కేటాయించవచ్చుననే హామీ లభించింది. రానున్న ఆర్థిక సంవత్సరంలోనూ రూ.2,500 కోట్లకంటే ఎక్కువ గ్రాంట్లు పెరిగే అవకాశం ఉంది. దీని ప్రకారం రూ17,500 కోట్లకంటే ఎక్కువ సహాయధనం లభించనుంది. మొత్తంగా సొంతంగా పన్నుల రూపంలో రూ.15-20వేలకోట్లు ఆదాయం పెంచుకోవడం, కేంద్ర పన్నుల వాటాలో 7వేల కోట్ల నుంచి అదనంగా రూ.2,500 కోట్లు పెరిగితే బడ్జెట్ రూ.4లక్షల కోట్లకు చేరనుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. 2023-24లో 3.27 లక్షల కోట్ల బడ్జెట్, 2024-25లో రూ.3.71 లక్షలకోట్లకు పెరగగా, 2025-26లో రూ.4లక్షలకోట్లకు పెరగనుంది.

మొదలైన కసరత్తు

కొత్త ఏడాది ప్రారంభంనుంచే సీఎం సిద్దరామయ్య బడ్జెట్‌పై కసరత్తు చేపట్టారు. మూడురోజులుగా వీలున్న సమయంలో ఆర్థికశాఖ ముఖ్యఅధికారులతో పాటు వివిధశాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలతో సమావేశం అవుతున్నారు. ఫిబ్రవరి 10లోగా శాఖలవారీగా కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. బడ్జెట్ ఫిబ్రవరిలో ప్రవేశపెట్టాలని నిర్ణయించిన మేరకు అందుకు అనుగుణంగా శాఖలవారీగా సమన్వయం కొనసాగిస్తున్నారు.



ప్రసాదం అందుకుంటున్న ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌కర్

సంప్రదాయాల్లో ఆధ్యాత్మికత

- దైవారాధన మన సంస్కృతిలో భాగం
- భగవంతుడి ముందు అందరూ సమానమే
- ధర్మస్థళలో భక్తులకు సదుపాయాలు భేష్
- క్యూకాంప్లెక్స్ ప్రారంభంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్

బెంగళూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మన దేశ సంస్కృతి, సంప్రదాయాల్లో ఆధ్యాత్మికత ముడిపడి ఉందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అన్నారు. ధర్మస్థళకు మంగళవారం వచ్చిన ఉపరాష్ట్రపతి దంపతులకు ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే సహా ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. అంతకుముందు మంగళూరు విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి దంపతులకు మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, ఎంపీ కేప్టెన్ బ్రిజేశ్ చౌట ఆత్మీయంగా స్వాగతించారు. ధర్మస్థళ మంజునాథస్వామి ఆలయంలో విశేషపూజల అనంతరం ఉపరాష్ట్రపతి దంపతులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. అనంతరం ఉపరాష్ట్రపతి దంపతులు వారి వారి తల్లుల జ్ఞాపకార్థం తలా ఒక మొక్క నాటారు. భక్తులకోసం నూతనంగా నిర్మించిన 'శ్రీ సాన్నిధ్య' కాంప్లెక్స్‌ను ఉపరాష్ట్రపతి లాంచనంగా ప్రారంభించారు. అక్కడి సదుపాయాలు వీక్షించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ మన సంస్కృతి సంప్రదాయాల్లో ఆధ్యాత్మికత ముడిపడి ఉందన్నారు. ప్రత్యేకించి ఆలయాలలో వీఐపీ కల్చర్ వీడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఉండాలన్నారు. కాగా ధర్మస్థళ సంస్థ ఆధ్యాత్మికతకే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో సమాజసేవలు అందిస్తోందని కొనియాడారు. అనంతరం నూతనంగా నిర్మించిన క్యూ కాంప్లెక్స్ భవనాలను ఆయన ప్రారంభించారు.



మొక్కలు నాటుతున్న ఉపరాష్ట్రపతి దంపతులు

కన్నకొడుకే..కడతేర్చాడు..!

- బీమా సొమ్ముకోసం తండ్రిని చంపిన కుమారుడు
- కలబురగిలో దారుణం
- నలుగురు నిందితుల అరెస్టు

బెంగళూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పున్నామ నరకం నుంచి తప్పించేవాడు పుత్రుడు అంటారు..కానీ కన్న కొడుకే తండ్రిని కడతేర్చాడు. బీమా సొమ్ముకోసం కన్నతండ్రిని హతమార్చిన మైసూరు జిల్లా పెరియపట్టణలో సంఘటన మరువకముందే కలబురగి జిల్లాలో అటువంటి ఉదంతమే ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే పోలీసులు భిన్నమైన కోణాలలో విచారణ జరపగా అసలు విషయం బయటపడింది. కలబురగి నగరం ఆదర్శకాలనీలో నివసించే కాళింగరావ్‌కు ముగ్గురు పిల్లలు. వీరిలో సతీశ్ అనే వ్యక్తి అదే కాలనీలో సాయిబాబా పేరిట హోటల్ నిర్వహిస్తున్నాడు. అప్పులు పెరిగిపోవడంతో దిక్కుతోచని స్థితికి చేరాడు. ఇదే హోటల్‌కు వస్తున్న అరుణ్ అనే మిత్రుడికి సమస్య చెప్పుకొన్నాడు. అందుకు మీ తండ్రి పేరిట బీమా పాలసీలు చేసి ప్రమాదంలో చంపేస్తే మీ సమస్యలు తీరుతాయని సలహా ఇచ్చాడు. అందుకు అనుగుణంగానే సతీశ్ తండ్రి కాళింగరావ్ పేరిట రూ.22లక్షలకు ఒక పాలసీ, రూ.5లక్షలకు మరో పాలసీ చేశాడు. మీ తండ్రి బతికున్నా చేసేదేమీ లేదని, తనకు రూ.3లక్షలు ఇచ్చేస్తే చంపేద్దామని అరుణ్ నమ్మించారు. ఇలా తండ్రిని జూలై 8న ఆదర్శనగర్ నుంచి బైక్‌పై తీసుకెళ్లారు. బెణ్ణూరు గ్రామంలో అప్పు ఇస్తున్నాడని తీసుకొద్దామంటూ తండ్రిని నమ్మించాడు. బైక్‌పై వెళ్తూ బెణ్ణూరుక్రాస్ వద్ద మూత్ర విసర్జనకు వెళ్లాలంటూ బండిని ఆపారు. రోడ్డుపక్కన కాళింగరావ్ నిలబడి ఉండగా అరుణ్ ట్రాక్టర్‌ను వేగంగా నడుపుకొంటూ వచ్చి ఢీ కొట్టాడు. దీంతో తీవ్రరక్తస్రావమై కాళింగరావ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పథకం ముగిసిందని భావించాక ఆ తర్వాత అరుణ్ ఒక చిన్నపాటి రాయితో సతీశ్‌పై గాయం చేస్తాడు. ఆ తర్వాత నేరుగా సతీశ్ మాడగూళ పోలీస్‌స్టేషన్‌కు బైక్‌పై వెళ్లి గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీ కొనడంతో తండ్రి చనిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సతీశ్ మాటలు నమ్మి పోలీసులు కేసు నమోదు చేశాడు. ఆ తర్వాత సతీశ్ తల్లికి చెందిన మొబైల్ నుంచి ఫోన్‌పే ద్వారా అరుణ్‌కు రూ.3లక్షలు చెల్లించాడు. ఈ విషయమై పోలీసులు అనుమానంతో విచారణ జరపగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సతీశ్, అరుణ్‌లతోపాటు యువరాజ్, రాకేశ్‌లను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. శహబాద్ డీఎస్పీ శంకరగౌడతోపాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ అడ్డూరు శ్రీనివాసులు ప్రశంసించారు.



కాళింగరావ్ (ఫైల్)



అరెస్టు అయిన నిందితులు



కరిసిద్దేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామి మూలవిరాట్

వైభవంగా కరిసిద్దేశ్వరస్వామి రథోత్సవం

కంప్లి, జనవరి 7(ఆంధ్ర జ్యోతి): తాలుకా పరిధిలోని బుక్కసాగర వద్ద వుండే కరిసిద్దేశ్వర రథోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం బుక్కసాగర కరిసిద్దేశ్వర మఠంలో విశ్వారాధ్య శివాచార్యుల ఆధ్వర్యంలో వివిధ దార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కరిసిద్దేశ్వర స్వామి 12వ పుణ్యారాధన సందర్భంగా డిసెంబరు 26 నుంచి ఇప్పటి వరకు సుమారు పది రోజులకు పైగా మఠంలో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. యేటా కరిసిద్దేశ్వర పుణ్యారాధన సందర్భంగా పది రోజులకు పైగా ఈ గ్రామంలో పండుగలా నిర్వహించుకుని చివరి రోజున రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటారు. మఠం నుంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి తిరిగి మఠంకు చేర్చుతారు. బుక్కసాగర, హోస్పేట, కంప్లి, సండూరు, సిరుగుప్ప, గంగావతి, కురుగోడు, తదితర గ్రామాలు, పట్టణాల నుంచి కూడా భారీ ఎత్తున పాల్గొని పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు.

ప్రోత్సాహకం పెంచాలని ఆశాల డిమాండ్

బెంగళూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రోత్సాహకధనం పెంచాలని ఆశా కార్యకర్తలు నిరసనకు దిగారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుంచి వేలాదిమంది ఆశా కార్యకర్తలు తరలిరాగా రైల్వేస్టేషన్ నుంచి ఫ్రీడం పార్కు దాకా ర్యాలీ చేశారు. అనంతరం పార్కులో ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ నేతృత్వంలో మంగళవారం భారీ నిరసన సాగింది. ప్రతి కార్యకర్తకు రూ.15వేలు కనీసవేతనం ఇవ్వాలని, సీనియారిటీ కల్గిన వారికి రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు మూడు నెలలుగా ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఫ్రీడంపార్కులో ఆశా కార్యకర్తల నిరసన



ఈటింగ్..మీటింగ్..!

- కాంగ్రెస్‌లో విందుల గోల
- ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలకు నేడు పరమేశ్వర్ విందు
- భగ్గుమంటున్న సీనియర్లు

బెంగళూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో విందులు కలకలం రేపుతున్నాయి. డీసీఎం డీకే శివకుమార్ టర్కీ పర్యటనలో ఉన్నప్పుడే ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్‌జార్కిహోళి ఈనెల 2న గురువారం పలువురు మంత్రులు, సన్నిహిత ఎమ్మెల్యేలకు విందు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఆ విందుకు సీఎం సిద్దరామయ్య వెళ్లడంతో రాజకీయ దుమారం రేగింది. ఈ అంశం మరువకముందే బుధవారం హోం మంత్రి పరమేశ్వర్ ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలకు విందు ఆహ్వానించడం సరికొత్త చర్చకు కారణమవుతోంది. ఓ హోటల్‌లో ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలకు పరమేశ్వర్ విందుకు ఆహ్వానించారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, సహకారశాఖ మంత్రి రాజణ్ణలతోపాటు పలువురిని విందులో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మలేషియా పర్యటనకు వెళ్లిన పరమేశ్వర్ అక్కడనుంచే ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి సతీశ్‌జార్కిహోళి ఇంట్లో జరిగిన విందులో డీసీఎం డీకే శివకుమార్‌ను ఏ విధంగా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించేందుకు వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది. అయితే సిద్దరామయ్య కూడా ఉండడంతో కొన్ని అంశాలు మాత్రమే చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. పరమేశ్వర్‌కు విందు ఏర్పాటు చేయాలని సీఎం సిద్దరామయ్య సలహా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో ఎంతమంది విందులో పాల్గొంటారనేది వేచిచూడాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.39,272 కోట్లు విడుదల కావాల్సి ఉంది. వీటికి సంబంధించి చర్చలు జరిపేందుకు ఆహ్వానిస్తున్నట్లు పరమేశ్వర్ చెబుతున్నా ఇతర అంశాలే కీలకమని తెలుస్తోంది. కాగా సతీశ్‌జార్కిహోళి నివాసంలో జరిగిన విందు తర్వాత సీఎం సిద్దరామయ్య స్పందిస్తూ వారంతా భోజనానికి కలవాలని నిర్ణయించారని తాను పాల్గొంటానని తెలిపి వెళ్లానన్నారు. భోజనానికి కలిస్తేనే రాజకీయ చర్చలనడం సరికాదన్నారు. మరోవైపు టర్కీ పర్యటన ముగించుకుని సోమవారం బెంగళూరుకు చేరుకున్న డీకే శివకుమార్ హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేనిఫెస్టోతో పాటు ఇతర అంశాలపై స్థానిక కాంగ్రెస్ నేతలతో చర్చలు జరిపారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన డీకే శివకుమార్ విందులో పాల్గొనడం తప్పు కాదని దాటవేశారు. కానీ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వద్ద రాష్ట్ర రాజకీయాలపై తీవ్రంగా చర్చించినట్లు తెలుస్తోంది. విదేశీ పర్యటనలో ఉన్నప్పుడే విందు రాజకీయం చేశారని, బుధవారం మరో విందు ఉందని రెండింటికీ తాను దూరంగా ఉన్నానని రాష్ట్రంలోని కాంగ్రెస్ వర్గాలు ఏమని అర్థం చేసుకోవాలని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణంలోనైనా అధిష్ఠానం విందు రాజకీయాలకు కారకులైనవారిపై తీవ్రంగా పరిగణించే అవకాశం ఉంది.



ఏఐసీసీ నాయకుల హెచ్చరికతో బ్రేక్ ..!

మంగళవారం రాత్రి ఏఐసీసీ నాయకులు తీవ్రమైన హెచ్చరికలు చేయడంతో బుధవారం ఏర్పాటు చేయదలిచిన విందు రద్దు చేసినట్టు సమాచారం. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఢిల్లీలో కీలక నేతలతో చర్చలు జరిపిన తర్వాతనే హెచ్చరికలు జారీ అయినట్టు తెలుస్తోంది. పరోక్షంగా వరుస విందులకు బ్రేక్ పెట్టినట్టయ్యింది.

మాలధారులకు మసీదులో విందు



రాయచూరు జనవరి 7(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని యరడోణ పట్టణంలో ని జామియా మసీదులో మంగళవారం అయ్యప్ప మాలాధారులకు మధ్నాహ్న విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీదు నిర్వాహకులు మాట్లాడుతూ సృష్టిలో ఉన్న మతాలన్నీ సమానమేనని, అందరూ ఒక్కటే అన్న భావంతోనే ఈ విందు ఏర్పాటు చేశామన్నారు. గడచిన కొన్నేళ్లేగా తాము ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గురుస్వాములు సిద్రామప్ప, ప్రభు యరడోణ, శివ కుమార్, వీరేశ్ హొన్నళ్ళి తదితరులున్నారు.



అయ్యప్ప మాలధారులకు భోజనం వడ్డిస్తున్న మసీదు నిర్వాహకులు



శింగనమల మండలం రాచేపల్లి పంచాయతీ మజరా.. అలంకరాయునిపేట. సుమారు వంద కుటుంబాలు, ఐదొందల జనాభా ఉండే చిన్న ఊరు ఇది. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ వంటి కనీస మౌలిక వసతులు లేక ఈ ఊరి జనం ఇబ్బంది పడుతున్నారు. వాటి పరిష్కారం కోసం స్వయంగా ఓ ఎమ్మెల్యే.. మరో ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం సమర్పించారు. మడకశిర ఎమ్మెల్యే స్వగ్రామం ఈ ఊరు. కానీ శింగనమల పరిధిలో ఉంది. దీంతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. ఎమ్మెల్యే బండారు శ్రావణిని డివిజన్ స్థాయి గ్రీవెన్స్‌లో సోమవారం కలిశారు. తన సొంతూరి కష్టాలను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సమక్షంలో ఎమ్మెల్యే శ్రావణికి వివరించారు. ఈ నేపథ్యంలో ఆ ఊరిని ఆంధ్రజ్యోతి మంగళవారం సందర్శించింది. అక్కడి ప్రజలతో మాట్లాడి.. ఊరి పరిస్థితిని తెలుసుకుంది.

- ఆంధ్రజ్యోతి, శింగనమల

అలంకరాయునిపేట ఊరు ముఖచిత్రం



ఆంధ్రజ్యోతి విజిట్

అవస్థలే అలంకరణ

తాగునీటికి పొలం బాట.. ఇళ్ల ముందు మురుగునీరు..

వంక దాటితేనే చదువులు

వర్షం కురిస్తే ఇళ్లలోకి కొండ నీరు

అభివృద్ధికి దూరంగా అలంకరాయునిపేట

సొంతూరి కష్టాలపై కదిలిన

మడకశిర ఎమ్మెల్యే

వ్యవసాయమే జీవనాధారం

అలంకరాయునిపేటలో రైతులు, రైతు కూలీల కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయమే ఈ ఊరి ప్రజల ప్రధాన జీవనాధారం. బోరుబావుల కింద చీనీ తోటలను సాగు చేశారు. దీంతోపాటు వరి సాగు చేస్తున్నారు. ఊరి పేరులో అలంకారం ఉన్నా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరే అలంకారంగా మారింది. వేసవిలో కాస్త పరవాలేదుగానీ, వర్షాకాలంలో మురుగునీరు, వర్షపునీరు చేరి పరిస్థితి దారుణంగా తయారౌతుంది. ఇంట్లోంచి కాలు బయట పెడితే బురదలో నడవాల్సిందే. సీసీ రోడ్లు వేసే సమయంలో డ్రైనేజీ కాలువలను నిర్మించకపోవడమే దీనికి కారణం. దీనికితోడు వర్షం కురిస్తే కొండపై నుంచి నేరుగా ఊరిలోకి వస్తుంది. గతంలో కాలువలు ఉండేవని, కానీ పూడిపోయాయని ఊరి జనం అంటున్నారు. కొండమీది నుంచి వచ్చే నీటితో ఇబ్బంది తలెత్తకుండా గ్రామస్థులే మట్టితో అడ్డుకట్ట వేశారు. అయినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు.



ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇల్లు

కష్టంగా చదువులు

ఎంఎస్ రాజు సొంతూరులో గతంలో ఐదో తరగతి వరకూ చదువు అందుబాటులో ఉండేది. వైసీపీ హయాంలో మూడో తరగతికి పరిమితం చేశారు. పాఠశాలలో రెండు గదులు ఉన్నాయి. ఒకటి శిథిలావస్థకు చేరడంతో మరో గదిలో సర్దుకుంటున్నారు. బడి భవంతికి అనుకుని పేడ దిబ్బలు వేశారు. దీంతో కంపు కొడుతోంది. మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవంతిలో నిర్వహిస్తున్నారు. సొంత భవనం లేదు. మూడో తరగతి దాటాక ఇంకా చదవాలంటే ఊరు దాటాల్సిందే. ఈ ఊరికి 5 కి.మీ. దూరంలో ఉన్న సలకంచెరువులో జడ్పీ పాఠశాల ఉంది. ఆ బడికి పోవాలంటే చీలేపల్లి సమీపంలోని కూతలేరు వంక దాటాలి. వర్షాకాలంలో ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. పెద్దలకే ఇబ్బంది. అలాంటిది బడిపిల్లలు వెళ్లడం సాహసమే. ఈ కారణంగా కొందరు చదువులకు దూరమయ్యారు.




ఇరుకు గదిలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు



ఆలంకరాయునిపేట నుంచి సలకంచెరువు పాఠశాలకు వెళ్లే దారిలో వంక

తాగునీటికి తంటాలు

ఊరిలో ఉప్పు నీరు వస్తుంది. ఇది పశువులు తాగేందుకూ పనికిరాదు. అందుకే గ్రామస్థులు వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తారు. పొలాల వద్ద నుంచి నీటిని తెచ్చి పశువులకు తాపిస్తారు. తామూ వినియోగిస్తారు. కూతలేరు వంకలో పంచాయతీ బోరు బావి ఉంది. అక్కడి నుంచి గ్రామానికి తాగునీటి పైప్‌లైన్ వేశారు. కానీ నాలుగు దశాబ్దాల క్రితం నాటివి కావడంతో దెబ్బతిన్నాయి. ఈ కారణంగా కలుషిత నీరు సరఫరా అవుతోంది.





← పాత నీటి ట్యాంకు, గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న రోడ్డు ↑

రోగాలబారిన పడుతున్నాం..



మాది చిన్న గ్రామం. ఎన్నేళ్లు గడిచినా అభివృద్ధి జరగలేదు. సరైన రోడ్లు లేవు. మురుగునీటి కాలువలు లేవు. అపరిశుభ్ర వాతావరణంతో రోగాలబారిన పడుతున్నాము. అధికారులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

-నారాయణస్వామి

తాగునీరు ఇవ్వాలి..



మా ఊరికి 40 ఏళ్ల కిందట తాగునీటి పైపులైన్లు వేసి, ట్యాంకు నిర్మించారు. పైపులు పగిలిపోయాయి. గ్రామంలో పారే మురుగునీరు పైపుల్లోకి చేరుతోంది. నీరు కలుషితమై పశువులు కూడా తాగడం లేదు. అధికారులు కొత్త బోర్లు, పైప్‌లైన్‌లు వేయాలి. మాకు మంచి నీటిని సరాఫరా చేయాలి.

-ఆదిశేషారెడ్డి



ఓ ఇంటి ముందు మురుగునీరు

మా రాజుపై నమ్మకం ఉంది...



మా గ్రామానికి చెందిన ఎంఎస్ రాజు మడకశిర ఎమ్మెల్యేగా ఉన్నారు. మా రాజుకు మా గ్రామ సమస్యలు తెలుసు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేతో మాట్లాడి అభివృద్ధికి బాటలు వేస్తారనే నమ్మకం ఉంది.

- నాగముని



రచ్చ కట్ట మీద పులిజీతం అడుతున్న గ్రామస్థులు

గోడ కట్టాలి...

వర్షాలు వస్తే భయం భయంగా ఉంటుంది. కొండ దిగువ ప్రాంతాంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతుంది. తాత్కాలికంగా కొండకు మట్టి కట్ట వేసుకున్నాం. అధికారులు ఎమ్మెల్యేలు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి. కొండ చుట్టూ ప్రహరీ నిర్మించాలి.



-కాంతమ్మ

బ్రిడ్జి కట్టండి..



మా ఊరి పిల్లలు బడికి వెళ్లాలంటే వంక దాటాలి. మా పొలాలు కూడా అక్కడే ఉన్నాయి. వర్షాకాలంలో వంక ఉధృతంగా పారుతుంది. వంక దాటేందుకు చిన్న బ్రిడ్జిని నిర్మించాలి. లేదంటే చిన్నారులు చదువులకు దూరమౌతారు.

-వెంకటలక్ష్మి

దరఖాస్తులకు సిద్ధం కండి

సబ్సిడీ రుణాలు వచ్చేశాయోచ్

స్వయం ఉపాధికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ...

త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ ఏడాదికి బీసీ కేటగిరీలోని కులాల ఆధారంగా రుణాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం రుణాలకు సంబంధించి వివరాలను ఓ ప్రకటనలో వెల్లడించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్ స్కీమ్ కింద స్వయం ఉపాధి కోసం రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకూ యూనిట్లను నిర్ణయించారు. ఇందులో లబ్ధిదారుడి వాటా కింద 50 శాతం సబ్సిడీ రానుంది. బ్యాంకుకు మిగతా 50 శాతం మొత్తాన్ని చెల్లించేలా ఆమోదం తెలిపారు. బీసీ కార్పొరేషన్ పరిధిలో ఈ ఏడాదికి 1728 యూనిట్లకు గానూ రూ. 32.90 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్‌కు 102 యూనిట్లకుగానూ 1.77 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు 58 యూనిట్లకుగానూ రూ. 1.01 కోట్లు, రెడ్డి కార్పొరేషన్‌కు 29 యూనిట్లకుగానూ రూ.50 లక్షలు, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు 21 యూనిట్లకు రూ.36 లక్షలు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 14 యూనిట్లకు రూ.24 లక్షలు, క్షత్రియ కార్పొరేషన్‌కు ఒక యూనిట్‌కుగానూ రూ.2 లక్షలు నిధులు విడుదల చేశారు. జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేసుకునే నిరుద్యోగ యువత కోసం రూ.8 లక్షలు రుణాలు అందించనున్నారు. వీరికి 50 శాతం సబ్సిడీ వర్తించనుంది. బీసీ కార్పొరేషన్ పరిధిలో 35 యూనిట్లకు రూ. 2.80 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్‌కు 17 యూనిట్లకు గానూ రూ.1.36 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు 9 యూనిట్లకుగానూ రూ.72 లక్షలు, రెడ్డి కార్పొరేషన్‌కు 5 యూనిట్లకుగానూ రూ.40 లక్షలు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌లకు 6 యూనిట్లకుగానూ రూ. 48 లక్షలు నిధులు విడుదల చేశారు. ఈ రుణాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ రూపొందించారు. ఈ వెబ్‌సైట్ త్వరలోనే అందుబాటులోకి రానుందని, తేదీని ప్రకటించేలోపు అర్హులైన ఆయా కేటగిరీల లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

టీఎన్‌ఏటీయూ జిల్లా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

అనంతపురం విద్య, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ అనంతపురం జిల్లా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం అనంతలక్ష్మి, ప్రధానకార్యదర్శి లక్ష్మీనరసమ్మ తెలిపారు. జిల్లాకు వచ్చిన వారు మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా మహిళా నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అడ్‌హక్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా వీణ, సభ్యులుగా రుక్మిణీదేవి, శ్యామల, జమున, అరుణ, గౌరవాధ్యక్షులుగా రమాదేవిని నియమించారు. జిల్లాలోని 11 ప్రాజెక్టుల్లో టీఎన్‌ఏటీయూ సభ్యత్వాలను ముమ్మరం చేయాలని సూచించారు. సభ్యత్వాల నమోదుకే అడ్‌హక్ కమిటీ వేస్తున్నామని, సభ్యత్వాల ప్రక్రియ ముగిసిన తర్వాత జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం దృష్టికి అంగన్‌వాడీల సమస్యలను తీసుకెళ్తామని వారు తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నేతలు

2016లో రూ. 4200 ఉన్న గౌరవ వేతనం టీఎన్‌ఏటీయూ పోరాటం వల్ల రూ. 10,500కి పెరిగిందని గుర్తుచేశారు. అంగన్‌వాడీల గ్రాట్యుటీ సమస్య పరిష్కరించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ మంజూరు చేయాలని, మినీవర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేసే జీవోను విడుదలచేయాలని డిమాండ్ చేశారు.

బువ్వ కష్టాలకు చెక్

మైనార్టీ హాస్టల్‌లో మెనూ అమలుకు శ్రీకారం

సంక్రాంతి తరువాత విద్యార్థులకు భోజనం




మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అన్ని మైనార్టీ హాస్టళ్లల్లో మెనూ(భోజనం)ను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో విద్యార్థులకు భోజన కష్టాలు తీరనున్నాయి. ఇన్నాళ్లు ప్రభుత్వం ఇచ్చే రూ.1600లతోనే నెలంతా ఇబ్బంది పడుతూ ఆకలి తీర్చుకుంటున్న విద్యార్థులకు ఆ బాధలు తప్పనున్నాయి. ఇక మీదట వసతి గృహాల్లోనే విద్యార్థులకు భోజనం పెట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలోనే ఆ శాఖ రాష్ట్ర అధికారులు వంట సామగ్రి తదితర వాటికి సంబంధించిన నివేదికలు తెప్పించుకున్నారు. నగరంలోని శారదానగర్ మైనార్టీ పోస్ట్‌మెట్రిక్ బాలుర వసతిగృహం ఉంది. అయితే అందులో దాదాపు కొన్నేళ్లుగా విద్యార్థులకు మెనూ అమలుకు అధికారాలివ్వలేదు. దీంతో డైట్ బిల్లులు వచ్చిన సమయంలో ఆ విద్యార్థుల ఖాతాలకు నెలకు ఒక్కొక్కరికి రూ.1600 జమ చేసేవారు. ఆ కొద్దిపాటి మొత్తం విద్యార్థులకు నెలంతా సరిపోయేది కాదు. దీంతో ఇంటి నుంచి తల్లిదండ్రులు పంపే డబ్బుతో సర్దుబాటు చేసుకునేవారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో మైనార్టీ విద్యార్థులకు ఈ బాధలు తప్పనున్నాయి.

హాస్టల్ సామర్థ్యం పెంచితే...

మైనార్టీ బాలుర కాలేజీ వసతిగృహంలో గతంలో 50 మంది విద్యార్థులకే అవకాశం కల్పించారు. దీంతో ఎంతో మంది పేద మైనార్టీ విద్యార్థులకు ఇబ్బందిగా ఉండేది. అందులో మెనూ కూడా అమలు చేయకపోవడంతో హాస్టల్‌లో 20 మందికి మించి ఉండేవారు. కాదు. ఈ ఏడాది కూడా 25 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మెనూను సక్రమంగా అమలు చేస్తే మరింత మంది విద్యార్థులు పెరిగే అవకాశముందన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు సమాచారం.

సంక్రాంతి తర్వాత మెనూ అమలు



నెల కిందటే మెనూ అమలుకు కావాల్సిన వంట సామగ్రి ఇతర వస్తువులకు సంబంధించి నివేదికలు తయారు చేసి రాష్ట్ర అధికారులకు పంపాం. అక్కడి నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ నేపథ్యంలోనే పొరుగు హాస్టల్ వార్డెన్లతో మాట్లాడుతున్నాం. వారి వద్ద వంట సామగ్రి ఉంటే దానితోనే సంక్రాంతి సెలవుల అనంతరం హాస్టల్ విద్యార్థులకు మెనూను అమలుచేస్తాం. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పెంచే విషయంపై అధికారులకు వివరించాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- రామసుబ్బారెడ్డి, ఏడీ, మైనార్టీ సంక్షేమశాఖ

మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలి

ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్

అనంతపురం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు తక్షణమే మినిమల్ టైం స్కేల్ అమలు చేయాలని ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రైతు బజార్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ నాయక్, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మిలతో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ శాఖలు, యూనివర్సిటీలు, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్‌ను (ఎంటీఎస్) వర్తింపజేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గత టీడీపీ హయాంలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా తమను కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగంలోకి తీసుకున్నారన్నారు. గత పదేళ్లుగా వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఇతర శాఖల్లోని ఉద్యోగుల తరహాలోనే సమాన పనికి సమాన వేతనం అందించే విధంగా మినిమమ్ టైం స్కేల్‌ను తక్షణమే వర్తింపజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు సుధాకర్, గంగరాజు, అపర్ణ, ఉమా, శిరీష, ధనలక్ష్మి, రెస్మా, నలినక్ష తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్

12 వరకు అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై ఈనెల 12వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని కలెక్టరు వినోద్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల ఏడో తేదీకే గడువు ముగిసినా ప్రభుత్వం మరో ఐదు రోజులు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అప్పటివరకు నిర్దేశించిన ప్రాంతాలలో అధికారులు అందుబాటులో ఉంటారని, ఎవరికైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. స్వీకరించిన అభ్యంతరాలను ఈనెల 16వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. అనంతరం వచ్చినవాటిపై తనిఖీ చేసి ఈనెల 20న గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శిస్తారన్నారు.

విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీగా బి.వినోద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకూ ఏడీగా ఉన్న అబ్దుల్ రసూల్ గతనెల ఉద్యోగ విరమణ పొందారు. చిత్తూరులోని అదే శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బి.వినోద్‌ను ఆ శాఖ రాష్ట్ర అధికారులు ఉమ్మడి అనంత జిల్లా ఏడీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఏడీకి ఆ శాఖ అధికారులు, సిబ్బంది, పలువురు విభిన్న ప్రతిభావంతులు శుభాకాంక్షలు తెలిపారు.



ఏడీ వినోద్

వాస్కో రైళ్ల పాక్షిక రద్దు

గుంతకల్లు, జనవరి7(ఆంధ్రజ్యోతి): నైరుతి రైల్వేలోని కాస్టిల్ రాక్-కులెమ్ సెక్షన్‌లో జరుగుతున్న మెయింటెనెన్స్ వర్కుల కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే వాస్కోడగామా రైళ్లను పాక్షికంగా రద్దు చేయనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. షాలిమార్-వాస్కోడగామా మధ్యన నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్ (నం. 18047) రైలును ఈ నెల 16 ఏప్రిల్ 15వ తేదీ వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 18048)ను ఈ నెల 19 నుంచి ఏప్రిల్ 18వ తేదీ వరకూ వాస్కోడగామా-హుబ్లీ సెక్షన్‌లో పాక్షికంగా రద్దుపరచి హుబ్లీ-షాలిమార్ సెక్షన్‌లో నడపనున్నట్టు తెలియజేశారు. అలాగే తిరుపతి-హైదరాబాద్, హైదరాబాద్-వాస్కో వెళ్లే (నం. 17419, 17019) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకూ వాస్కో వరకూ కాకుండా కేవలం హుబ్లీ వరకు మాత్రమే నడపనున్నట్టు వివరించారు. అలాగే వీటి తిరుగు ప్రయాణపు రైళ్లను (నం. 17420, 17022) ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకూ హుబ్లీ-వాస్కో సెక్షన్‌లో పాక్షికంగా రద్దు పరిచామన్నారు. సికింద్రాబాద్-వాస్కోడగామా బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 17 నుంచి ఏప్రిల్ 16 వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17040) ఈనెల 18 నుంచి ఏప్రిల్ 17వ తేదీ వరకూ హుబ్లీ-వాస్కో సెక్షన్‌లో పాక్షికంగా రద్దుచేశారు.

రైళ్ల ఆలస్యం



గుంతకల్లు, జనవరి7(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో జరుగుతున్న మెయింటెనెన్స్ పనుల కారణంగా కాచిగూడ-గుంతకల్లు (నం. 57412), గుంతకల్లు-బోధన్ (నం. 57411) రైళ్లను ఈ నెల 20, 27 తేదీల్లో ఆలస్యంగా నడపనున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. కాచిగూడ-గుంతకల్లు రైలును మూడున్నర గంటలు, గుంతకల్లు-బోధన్ రైలును 3 గంటల ఆలస్యంగా నడపనున్నట్టు తెలియజేశారు.



చిరంజీవితో భవానీ రవికుమార్

చిరంజీవిని కలిసిన భవానీ రవికుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సినీ హీరో మెగాస్టార్ చిరంజీవిని, చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు భవానీ రవికుమార్ కలిశారు. హైదరాబాదులోని చిరంజీవి స్వగృహంలో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి తనను గుర్తుపట్టి, ఆప్యాయంగా పలుకరిస్తూ ఆలింగనం చేసుకోవడంతో భావోద్వేగానికి గురైనట్లు భవానీ తెలిపారు. మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన తనను ఆశీర్వదించడం తన జీవితంలో మరిచిపోలేనన్నారు.

చాముండేశ్వరికి రాష్ట్ర పదవి

అనంతపురం టౌన్, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఏపీ హంస స్టేట్‌జాయింట్ జనరల్ సెక్రెటరీగా స్టాఫ్‌నర్సు చాముండేశ్వరి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. చాముండేశ్వరి ప్రస్తుతం అనంత సర్వజన ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పని చేస్తున్నారు. తనకు రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు అప్పగించడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

పరమాచార్య శ్రీ చంద్రశేఖర స్వామి (వర్ధంతి)



తమిళనాడులోని కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామిజీని 'మహాపెరియవ'గా భక్తులచే పిలవబడ్డారు. కంచి కామకోటి పీఠానికి 68వ పీఠాధిపతిగా సేవలందించిన స్వామిజీ 1894 మే 24న స్వామినాథన్‌లో జన్మించారు. 1907లో కంచికామకోటి పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టారు. ఆది శంకరాచార్య ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతాన్ని బలంగా భక్తుల్లోకి తీసుకెళ్ళారు. కామాక్షి అమ్మ దేవస్థానంలోనే ఎక్కువ సమయం గడిపిన స్వామిజీ తన బోధనలతో భక్తకోటిని ఎంతగానో ప్రభావిత పరిచారు. 1994 జనవరి 8న ఆయన భగవదైక్యం పొందారు.

మామిడిపూడి వెంకట రంగయ్య (జయంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు మామిడిపూడి వెంకటరంగయ్య నెల్లూరులో 1889 జనవరి 8న జన్మించారు. ప్రముఖ చరిత్ర పరి శోధక రచయితగా ఖ్యాతి గడించిన ఆయనకు కేంద్ర ప్రభుత్వం 1968లో పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసింది. భారతీయ చరిత్ర, రాజ్యాంగం, పంచాయత్ రాజ్ అనే అంశాలపై ఎన్నో పుస్తకాలను రచించారు. 93వ యేట 1982లో కన్నుమూశారు. వీరి జ్ఞాపకార్థం సికింద్రాబాద్‌లో మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి పలు సేవలను అందిస్తున్నారు.

కేలూచరణ్ మహాపాత్ర (జయంతి)



ప్రఖ్యాత భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య గురువు పద్మవిభూషణ్ కేలూచరణ్ మహాపాత్ర 1926 జనవరి 8న జన్మించారు. ప్రత్యేకించి ఒడిస్సీ నృత్యంలో అందెవేసి 'పద్మ విభూషణ్' పురస్కారం అందుకున్న తొలి నృత్యగురువుగా అరుదైన ఖ్యాతిని అందుకున్నారు. యువకుడిగా 'గోతిపువ' అనే సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ పురస్కారం, కాళీదాస్ సమ్మాన్ పురస్కారం పొందారు. 2004లో ఆయన కన్నుమూశారు.

స్టీఫెన్ హాకింగ్ (జయంతి)



ప్రముఖ వైద్యనిపుణుడు, ఆంగ్ల రచయిత, సాహితీవేత్త స్టీఫెన్ విలియం హాకింగ్ 1942 జనవరి 8న ఆక్స్‌ఫర్డ్‌లో జన్మించారు. తన 21వ యేట అనారోగ్యానికి లోనై క్రమేపీ మాటను కోల్పోయారు. ప్రత్యేక పరికరం ద్వారా కమ్యూనికేట్ చేయడం అలవాటు చేసుకున్నారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో దాదాపు రెండు దశాబ్దాల పాటు ఆయన మ్యాథ మ్యాటిక్స్‌లో లుకేసియన్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. మోటార్ న్యూరోన్ వ్యాధితో అలమటిస్తూనే ఆయన 50 ఏళ్ళు జీవించారు. ఎన్నో పురస్కారాలను పొందారు. 76వ యేట 2018లో ఆయన మృతి చెందారు.

సయీద్ జఫ్రీ (జయంతి)



ప్రముఖ బ్రిటీష్ ఇండియన్ యాక్టర్ సయీద్ జఫ్రీ 1929 జనవరి 8న జన్మించారు. రేడియో కళాకారుడిగా, బుల్లి తెరనటుడిగా దాదాపు 6 దశాబ్దాల పాటు రకరకాల పాత్రలను పోషించి ప్రేక్షకులను మెప్పించారు. 1980, 90లలో బ్రిటన్‌లో ఉత్తమ ఆసియన్ నటుడిగా ఖ్యాతిపొందారు. నటుడిగా ఆయన ఎన్నో పురస్కారాలను పొందారు. 2015లో ఆయన కన్నుమూశారు. మరణానంతరం 'పద్మశ్రీ' ప్రకటించారు.

ఎల్విస్ ప్రెస్లీ (జయంతి)



ప్రఖ్యాత అమెరికన్ గాయకుడు ఎల్విస్ ప్రెస్లీ 1935 జనవరి 8న జన్మించారు. 'కింగ్ ఆఫ్ రాక్ అండ్ రోల్'గా ఖ్యాతి పొందారు. 1956లో విడుదలైన సంగీత ఆల్బం 'హార్ట్ బ్రేక్ హోటల్' అమెరికాను ఉర్రూతలూగించింది. మూడుసార్లు గ్రామీ అవార్డును సొంతం చేసుకున్నారు. 36 ఏళ్ళ ప్రాయంలో గ్రామీ జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. సంగీతంలో ఎన్నో ప్రయోగాలు చేసి ప్రేక్షకులను రంజింపచేశారు. గుండెపోటుకు గురై 1977లో కన్నుమూశారు.

ఊర్మిళ సత్యనారాయణన్ (పుట్టిన రోజు)



ప్రముఖ భారతీయ శాస్త్రీయ నృత్య కళాకారిణి ఊర్మిళ సత్యనారాయణన్ చెన్నైలో 1975 జనవరి 8న జన్మించారు. భరతనాట్యంలో ఆమె దండాయుధపాణి పిళ్ళై వద్ద శిక్షణ పొందారు. 1996లో 'నాట్యసంకల్ప' సంస్థను ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులకు భరతనాట్యంలో శిక్షణ ఇస్తున్నారు. 20 సంవత్సరాల్లో 100 ఆరంగేట్రాలను నిర్వహించి రికార్డు సృష్టించారు. తమిళనాడు ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'కళైమామణి' పురస్కారాన్ని ప్రదానం చేసి ఊర్మిళను గౌరవించింది.

బియ్యం విక్రయానికి టెండర్లు

సిరుగుప్ప, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జనవరి 20న 300 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యంకు టెండర్లు పిలుస్తున్నట్లు తహసీల్దార్ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తాలుకాలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని వేరే చోటకు తరలిస్తున్న వారిపై దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్న 700 క్వింటాళ్ల బియ్యాన్ని జిల్లా అధికారులు, కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీఎంసీ మార్కెట్ ఆవరణంలో టెండర్ ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి వున్న వారు ఈ టెండర్లో పాల్గొనాలని తెలిపారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆదోని రోడ్డు మార్గంలో ప్రసిద్ధి చెందిన తాయమ్మదేవికి మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రధాన అర్చకులు ప్రవీణ్ ధూప దీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు.



ప్రతి వ్యక్తి నీటి సంరక్షణకు కట్టుబడాలి

» జలమండలి చైర్మన్ రామ్‌ప్రసాత్ మనోహర్

బెంగళూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తోందని నీటిని వృథా చేయరాదని ప్రతి వ్యక్తి నీటి సంరక్షణకు కట్టుబడాలని జలమండలి చైర్మన్ డాక్టర్ రామ్‌ప్రసాత్ మనోహర్ అభిప్రాయపడ్డారు. సౌందర్యసెంట్రల్ కళాశాలలో జలమండలి ఆధ్వర్యంలో కర్ణాటకలో నీటి పరంపరపై దరోహర వార్షిక ప్రదర్శనలను మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. గత ఏడాది 200 రోజులపాటు వర్షం కురవకపోవడంతో బెంగళూరులో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండేదని అప్పట్లో సమర్థవంతంగా అందరికీ నీరు సమకూర్చామన్నారు. సవాళ్లను అవసరమైనప్పుడు ఎదుర్కోవాలన్నారు. కానీ నీటి సంరక్షణకు ప్రతివ్యక్తి కట్టుబడాలని పిలుపునిచ్చారు. దరోహర కార్యక్రమంలో భాగంగా చిన్నారులచే డ్రాయింగ్, ప్రత్యేక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జలమండలి చైర్మన్‌ను సౌందర్యకళాశాల సిబ్బంది ప్రత్యేకంగా సత్కరించారు.



జలమండలి చైర్మన్ రామ్‌ప్రసాత్ మనోహర్‌కు సన్మానం

ఫిబ్రవరిలో హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్‌కు భూమిపూజ



మీడియాతో మంత్రి సుధాకర్ తదితరులు

శిడ్లఘట్ట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ తాలూకా ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పట్టుగూళ్ల హైటెక్ మార్కెట్‌కు ఫిబ్రవరిలో సీఎం సిద్దరామయ్య భూమి పూజ చేస్తారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ వెల్లడించారు. పట్టణంలోని ఫస్ట్‌గ్రేడ్ కళాశాలను సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు, రీలర్‌లు ఎంతోకాల డిమాండ్‌గా ఉన్న హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేసిందన్నారు. టెండరు పిలిచే ప్రక్రియ దశలో ఉందని ఫిబ్రవరిలో భూమిపూజకోసం సీఎంను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. శిడ్లఘట్ట మార్గంగా చిక్కబళ్ళాపుర నుంచి కోలారు వరకు జాతీయ రహదారి 234ను చతుష్పథ మార్గంగా మార్చేందుకు జాతీయ రహదారి ప్రాధికారకు విన్నవించగా సానుకూలంగా స్పందించారని త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయన్నారు. కాగా అనేక పాఠశాలల్లో విద్యార్థులకు తగిన విధంగా తరగతి గదులు నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్, కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ, బంకు మునియప్ప, ఈఓ హేమావతి తదితరులు ఉన్నారు.

చిత్రావతి డ్యామ్ కాలువలో స్వచ్ఛతా చర్యలు

బాగేపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఏకైక జీవనదిగా ఉన్న చిత్రావతి నదికి అనుబంధమైన డ్యామ్ కాలువలో స్వచ్ఛతా చర్యలు చేపట్టారు. డ్యామ్ కిందిభాగంలో పేరుకున్న చెత్తా చెదారాన్ని పురసభ సిబ్బంది తొలగించారు. డ్యామ్ కాలువలో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, బట్టలు, గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా పురసభ ఆరోగ్య అధికారి ఉషారాణి మాట్లాడుతూ ప్రధానంగా హోటళ్ల నిర్వాహకులు, ప్రజలు సైతం చెత్తా చెదారాన్ని పడేస్తుండడంతోనే సమస్య ఏర్పడుతోందన్నారు. మన నీటి మూలాలను కలుషితం చేసుకోరాదన్నారు. స్వచ్ఛ నదికి ప్రజలు సహకరించాలని కోరారు. పురసభ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా పనుల్లో పురసభ సిబ్బంది

అలరించిన నృత్యోత్సవం



నృత్య సన్నివేశం

బెంగళూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యోత్సవం అలరించింది. కళానికేతన్ అధ్యక్షులు ఏవీ శ్రీధర్, వ్యవస్థాపక కార్యదర్శి జీవీ వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో ప్రదర్శనలు సాగాయి. భరతనాట్యం, కూచిపూడి నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. వయ్యాలికావల్‌లోని శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో కార్యక్రమం జరిగింది. నృత్య గురువులు సుష్మాశ్రీధర్, శాలిని శ్రీకాంత్‌ల వద్ద నేర్చుకున్న శిష్యులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. తరచుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. సంస్కృతి సంప్రదాయాల పరంపరలో భాగంగా కన్నడ సంస్కృతిశాఖ సహకారంతో మరింత ముందుకు సాగుతామన్నారు. సంగీత అభిమానులు పాల్గొన్నారు.

రేవాను అంతర్జాతీయస్థాయికి చేర్చడమే లక్ష్యం

» చాన్స్‌లర్ డాక్టర్ పి. శ్యామరాజు

బెంగళూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రేవా యూనివర్సిటీని అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని చాన్స్‌లర్ డాక్టర్ పి.శ్యామరాజు అభిప్రాయపడ్డారు. రేవా యూనివర్సిటీలో ఫౌండర్స్‌డేను సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామరాజు మాట్లాడుతూ రుక్మిణి ఎడ్యుకేషనల్ విజనరీ అకాడమీ (రేవా)ను 240మంది విద్యార్థులతో ప్రారంభించామని ప్రస్తుతం 16వేలమంది చదువుతున్నారన్నారు. మనకు అన్ని సౌలభ్యాలు ఇచ్చిన సమాజానికి ఏమైనా చేయాలనే లక్ష్యంతోనే యూనివర్సిటీలో గుణాత్మకతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఏటా రేవా విద్యాసంస్థ అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. ఫౌండర్స్ డే సందర్భంగా పారా అథ్లెట్ మాలతిహొళ్ళకు రేవా జీవనసాఫల్య పురస్కారాన్ని, చరిత్రకారుడు డాక్టర్ విక్రమ్‌సంపత్‌కు రేవా ఎక్సలెన్సీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. మాలతిహొళ్ళ మాట్లాడుతూ అంగవైకల్యం శాపంగా భావించరాదని ప్రత్యేక ప్రతిభతో సాధనలు చేయాలన్నారు. 14 నెలల్లో పోలియో వచ్చిందని రెండేళ్లపాటు తల్లి ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. ఎలక్ట్రికల్ షాక్ ఇచ్చినందుకు శరీరంలో సగంభాగం చైతన్యం కోల్పోయిందన్నారు. అయితే తల్లి నమ్మకం, ఆత్మవిశ్వాసంతో ఎదిగానన్నారు. మాకు సమాజం ఎంతో ప్రోత్సహించిందని అందుకే మాతృ ఫౌండేషన్ ద్వారా 53మంది దివ్యాంగ పిల్లలకు ఉచిత శిక్షణ సౌలభ్యాలు ఇస్తున్నామన్నారు. బాల్యంలోనే కోల్పోయిన మాతృత్వాన్ని వారిద్వారా పొందుతున్నామన్నారు. ఇలా 53మంది పిల్లలకు తల్లి అన్నారు. డాక్టర్ విక్రమ్ సంపత్ మాట్లాడుతూ భవిష్యత్తులో భారత్ అన్ని రంగాలలోనూ విశ్వగురు కానుందన్నారు. విద్యాసంస్థలు క్రియాత్మకత, సృజనశీలత కల్గిన యువ నాయకులను తయారు చేసే పరిశ్రమలు కావాలన్నారు. భారత మూలాల్లోని సంస్కృతి ఎవరిపైనా యుద్ధ చేయడం, మరొకరిని రెచ్చగొట్టే సంస్కృతి కాదన్నారు. నలంద, తక్షశిల, విక్రమశిల వంటి విశ్వవిద్యాలయాలలో విదేశీయులు చదివేందుకు వస్తారన్నారు. నారాయణ హృదయాలయ ఆసుపత్రి ముఖ్యులు డాక్టర్ దేవిప్రసాద్‌శెట్టి పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రొ-చాన్స్‌లర్ ఉమేశ్ ఎస్ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ సంజయ్ ఆర్ చట్నిస్, రియాక్టర్ అలెగ్జాండర్, తదితరులు పాల్గొన్నారు.



పారా అథ్లెట్ మాలతిహొళ్ళ తదితరులకు సన్మానం

రైతులతో అధికారుల చర్చలు

కంప్లి, జనవరి 7(ఆంధ్ర జ్యోతి): కుడితిని పట్టణంలో కర్మాగారాలకు పొలాలు పోగొట్టుకున్న జానెకుంటి, అరిగిణదోణి, యర్రంగళి, కొళగల్, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపురం గ్రామాల రైతులు నిరసన చేపట్టి 752 రోజులు కావడంతో మంగళవారం అసిస్టెంట్ కమీషనర్ ప్రమోద్ కుడితిని చేరుకుని రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్ మాట్లాడుతూ రైతులకు న్యాయం చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా తిప్పేస్వామి, జంగ్లిసాబ్, అంజినప్ప, తిమ్మప్ప, సిద్దప్ప, తదితర రైతులు మాట్లాడుతూ గతంలోనే బెల్గామ్‌లో జరిగిన సమావేశాల్లో చర్చించినా తమకు న్యాయం జరుగలేదన్నారు. ఇకపై ఉపేక్షించేది లేదన్నారు. వారితో పాటు తహసీల్దార్ గురురాజు, డీవైఎస్పీ ప్రసాద్ గోఖలే, సీపీ విశ్వనాథ్, హిరేగౌడ, శ్రీధర్, ఉచ్చప్ప, మల్లికార్జున, మంజునాథ్, నాగప్ప, శివన్న, గంగమ్మ, నాగమ్మ, కుడితిని, హరిగిణదోణి, జానెకుంటి, వేణి వీరాపురం, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.



నిరసనలో మాట్లాడుతున్న జిల్లా కమిషనర్ ప్రమోద్

జిల్లాలో మరో బాలింత మృతి..!

రాయచూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారుతున్న బాలింతల మృతి జిల్లాను వీడడం లేదు. దేవదుర్గ తాలూకా హద్దినాళ గ్రామానికి చెందిన బాలింత సరస్వతి(24) రెండు రోజుల క్రితం మృత్యువాత పడడం జిల్లాలో మరో సారి చర్చనీయంశమైంది. సరస్వతికి పురుటినొప్పులు ఎక్కువ కావడంతో దేవదుర్గ తాలూకా ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం ఆమెను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. సిజేరియన్ ద్వారా పురుడుపోసిన అధికారులు ఆమెకు రక్తస్రావం అధిక కావడంతో మృత్యువాతపడినట్లు చెబుతున్నారు. పుట్టిన నవజాత శిశువును వెంటిలేటర్‌లో ఉంచి చికిత్సనందిస్తుండడం ఈ సందర్భంగా గమనార్హం. కాగా జిల్లాలో ఇప్పటికి నలుగురు మహిళలు బాలింత చావులకు గురికాగా మరో మహిళ అదే రీతిలో మృత్యువాత పడడం జిల్లాలో కలకలంగా మారింది. కాగా ప్రసవం సమయంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు వినియోగిస్తున్న మందులు నాసిరకంగా ఉండడం వల్లే ఈ మరణాలు సంభవిస్తున్నట్లు ప్రజల్లో అనుమానం నెలకొంది. దీని పై ఇప్పటికే స్పందించిన ప్రభుత్వం నిజానిజాలను నిర్ధారించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయగా ఈ అంశాన్ని జిల్లా అధికారులు కమిటీ దృష్టికి తెచ్చేందుకు సిద్ధమైయ్యారు.



సరస్వతి(ఫైల్)

జంతు బలిని ఆపకుంటే కోర్టు ధిక్కరణ కేసు

● దయానంద స్వామీజీ



రాయచూరు జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత ప్రసిద్ధిగాంచిన సింధనూరు తాలూకాలోని సోమలాపురం అంబామఠం వద్ద ఈ నెల 12 నుంచి ప్రారంభమైయ్యే జాతర మహోత్సవం సందర్భంగా జంతు బలిని అడ్డుకోవాలని ప్రపంచ ప్రాణబలి నిర్మూలన జాగృతి మహామండలి, ప్రపంచ ప్రాణకోటి సంక్షేమ మండలి అధ్యక్షుడు, బసవధర్మ పోరాట సమితి అధ్యక్షుడైన దయానంద స్వామిజి డిమాండ్ చేశారు. మంగళవారం రాయచూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లోవిలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి స్వామిజి మాట్లాడారు. అంబాదేవి మఠం జాతర సందర్భంగా జరిగే జంతుబలికి సంబంధించి ఇప్పటికే తాము క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తి సమగ్ర సమాచారాన్ని సేకరించామని తెలిపారు. ఏటా జిల్లాలోని 900కుపైగా దేవాదాయ శాఖ పరిధిలోనున్న ఆలయాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షలకు పైగా ఉన్న దేవాలయాల వద్ద ప్రతి ఏటా కోట్ల సంఖ్యలో ప్రాణ బలి, జంతుబలి జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.

యోగేశ్‌గౌడ కేసులో భార్య సాక్ష్యం వద్దు..

కోర్టుకు సీబీఐ వినతి

బెంగళూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ధారవాడ జిల్లా పంచాయతీ సభ్యుడు బీజేపీకి చెందిన యోగేశ్‌గౌడ హత్యకేసులో తొలిఫిర్యాదు దారురాలైన భార్య మల్లమ్మ సాక్ష్యం అవసరం లేదని సీబీఐ తరపు న్యాయవాదులు ప్రజాప్రతినిధుల కోర్టుకు మంగళవారం విన్నవించారు. పోలీసులు జరిపిన విచారణలో ఆమె వ్యతిరేకమైన వ్యాఖ్యలు చేశారని, సీబీఐ విచారణలో భిన్నమైన అంశాలు ప్రస్తావించారు. ఈకేసులో మాజీ మంత్రి, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణి 9 నెలలపాటు జైలులో గడిపారు. అయితే కేసుకు సంబంధించిన విచారణలో యోగేశ్‌గౌడ భార్య మల్లమ్మ సాక్ష్యం విషయంలో భిన్నమైన అంశాలు ప్రస్తావిస్తున్నారని ప్రత్యేక కోర్టుకు విన్నవించారు. తొలుత సీబీఐ సాక్ష్యంగా పరిగణించారు. కానీ ఆమె విచారణకు సహకరించకపోవడంతోపాటు ఇటీవల అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకున్నాయని ఈ కారణంతోనే మల్లమ్మ సాక్ష్యాలను వదులుకున్నట్టు సీబీఐ వర్గాలు తెలిపాయి. తొలుత పోలీసుల విచారణ వేళ యోగేశ్ సోదరుడు గురునాథ్‌గౌడ, మల్లమ్మలను దూరం ఉంచారు. అయితే సీబీఐ దర్యాప్తు ప్రారంభించాక మల్లమ్మను సాక్ష్యంగా పరిగణించారు. ఇప్పటికే ప్రత్యక్షసాక్షులనుంచి సమగ్రమైన సమాచారం సేకరించారని సీబీఐ తెలిపింది. ఈ కేసులో ప్రధానమైన నిందితుడిగా భావిస్తున్న వినయ్ కులకర్ణిని జైలునుంచి విడుదల చేస్తే సాక్ష్యులపై ప్రభావం చూపుతారని సీబీఐ అభ్యంతరం తెలిపింది. దీంతో వినయ్ కులకర్ణికి 9నెలలపాటు బెయిల్ దక్కలేదు. చివరకు బెయిల్ మంజూరైనా ఆయన సొంతూరు ధారవాడ ప్రవేశం నిషేధంగా ఉంది. ఏడాదిన్నర క్రిందటి శాసనసభ ఎన్నికల్లోనూ బెళగావి, బాగల్కోట ప్రాంతాల్లోనే ఉంటూ ఎన్నికలను పర్యవేక్షించి గెలుపొందారు. ఆ తర్వాత కూడా ధారవాడ ప్రవేశానికి కోర్టు అనుమతి ఇవ్వలేదు. పైగా ఇటీవల వినయ్‌కులకర్ణి బర్త్‌డేలో యోగేశ్‌గౌడ భార్య మల్లమ్మ పాల్గొన్న ఫోటోలు వైరల్ అయ్యాయి. ఇలాంటి కారణాలు చూపి ఆమె సాక్ష్యం పరిగణించమని సీబీఐ తరపు న్యాయవాదులు ప్రజాప్రతినిధుల ప్రత్యేకకోర్టుకు విన్నవించారు.

2 లక్షల మందికి సేవలు లక్ష్యం

బెంగళూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు వ్యాప్తంగా ఏడాదిలోగా 2లక్షలమందికి మానవత్వపు సేవలు అందించదలిచామని ఏఐఆర్ ఆత్మన్ ఇన్ రవి తెలిపారు. అనాథాశ్రమాల ద్వారా గాడ్ ఈజ్ దేర్ పేరిట సేవలు విస్తారం చేయదలిచామన్నారు. ప్రస్తుతానికి లక్షమంది అనాథలు, వృద్ధులకు నగరంలోని వివిధ ప్రాంతాలలో ఆశ్రమాల ద్వారా సేవలందిస్తున్నామన్నారు. ఈ ఏడాది మానసిక వికలాంగులు, వృద్ధులు, సమాజంలో వివిధ కారణాలతో దుర్భరమైన జీవితాలు గడుపుతున్న వారికి అవసరమైన సేవలు అందించదలిచామన్నారు. మా ప్రయత్నంకు సహకరించాలన్నారు. కిడ్స్ కెంప్ పేరిట గతంలో షోరూం నడిపిన రవి ఇటీవల రెండు దశాబ్దాలకుపైగా నగరంలో అనాథలకోసం సేవలందిస్తున్నారు. తాజాగా హెణ్ణూరు ప్రాంతంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులు, మానసిక రుగ్మతతో ఇబ్బందిపడుతున్నవారికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు.



దివ్యాంగులతో సమాజసేవకుడు రవి

పోయెట్ ఆఫ్ ది ఇయర్ కామేశ్వరరావు



కామేశ్వరరావు

బెంగళూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఇన్నర్ విజన్ కవితల సంపుటికి యుపియోటో లిటరరీ అవార్డులలో భాగంగా 2024 సంవత్సరానికి గాను పోయెట్ ఆఫ్ ది ఇయర్‌ను విశాఖపట్నంలో ప్రకటించారు. ప్రముఖ కవి, ఆకాశవాణిలో డైరెక్టర్ హోదాలో రిటైరైన రొక్కం కామేశ్వరరావు ఇన్నర్ విజన్ కవితలకు అవార్డు దక్కింది. ప్రస్తుతం కామేశ్వరరావు బెంగళూరులో నివసిస్తున్నారు. ఆయన కవితా సంపుటాలు వివిధ భాషలలోకి అనువాదమయ్యాయి. ఈనెల 12న కోల్కత్తాలో జరిగే మూడో లిటరరీ కార్నివాల్‌లో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈమేరకు కామేశ్వరరావుకు పలువురు తెలుగు సాహితీవేత్తలు అభినందించారు.

బార్ మూసివేయాలని నిరసన


దొమ్మసంద్ర, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా మెణసిగనహళ్ళిలో నిర్మిస్తున్న బార్‌ను మూసివేయాలని కోరుతూ వందలాది గ్రామస్థులు నిరసన చేపట్టారు. మెణసిగనహళ్ళి నుంచి హుచ్చనహళ్ళికి వెళ్లే మార్గంలో నిర్మానుష్య ప్రదేశంలో బార్ నిర్మించడాన్ని తప్పుబట్టారు. ఎక్సైజ్‌శాఖను ఖండిస్తూ బార్ ఎదుట బైఠాయించి మహిళలు నిరసన తెలిపారు. గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షురాలు చైత్రబాబు మాటాడుతూ బార్ కారణంగా ఈ మార్గంలో నడవాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంటోందన్నారు. గ్రామస్థుల నిరసనతో ఎక్సైజ్‌శాఖ అధికారులు ఖంగు తిన్నారు. కాగా నిర్వాహకులు అక్కడికి వచ్చి ప్రభుత్వ నుంచి అనుమతి పొందాకనే నిర్మాణాలు చేపట్టామని బదులిచ్చామని చెబుతున్నా గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిరసనలో శోభారత్నమ్మ, స్త్రీశక్తిసంఘాల పదాధికారులు పుష్ప, భారతి, నాగరత్న, సుధ, ప్రభావంతి, మంజుల, నిర్మల, రాజమ్మ, మంజుల, రాధ, బేబి తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో గ్రామస్థులు

దరోజీ సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవం

కంప్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని కొత్త దరోజీ ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికైంది. 12 మంది సభ్యులు వుండగా అందులో అధ్యక్ష స్థానానికి మంజునాథ్, ఉపాధ్యక్ష స్థానానికి వలీ మసీద్‌లు నామినేషన్ వేశారు. వారికి ఎవరూ పోటీ లేనందువలన అధ్యక్ష స్థానానికి మంజునాథను, ఉపాధ్యక్ష స్థానానికి వలీ మసీద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి గంగాధర తెలిపారు. గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు సభ్యులకు కూడా అభినందించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.17	1,589.03
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,146	0
నీటి నిల్వ (టీఎంసీలు)	77.04	10.24

అభివృద్ధికి నోచుకోని సండూరు ఏపీఎంసీ

● సరైన సౌకర్యాలు లేక రైతుల విలవిల ● పట్టించుకోని ప్రజా ప్రతినిధులు



ప్రారంభం కాని మార్కెట్ షెడ్

బళ్లారి గాంధీనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సండూరు ఏపీఎంసీ మార్కెట్ దుస్థితిపై ఆలకించే నాథుడే కరువ య్యారని స్థానిక వ్యాపారస్తులు, ప్రజలు వాపోతున్నారు. ఐదేళ్ళ పాటు సండూరు ఎమ్మెల్యేగా ఉన్న తుకారం మార్కెట్ అభివృద్ధికి చేసేందేమీ లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం బళ్ళారి లోక్‌సభ సభ్యులుగా గెలుపొందగా, ఉప ఎన్నికల్లో సతీమణి అన్నపూర్ణ సండూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఒకే ఇంట్లో ఉన్నా సండూరు మార్కెట్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బళ్ళారి ఏపీఎంసీ పరిధిలో నాలుగు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిధులు అన్ని బళ్ళారిలోని ఏపీఎంసీ మార్కెట్ అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారే మినహా.. గ్రామీణ ప్రాంతాల రైతులకు ఆసరాగా ఉన్న చిన్న మార్కెట్‌లను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సండూరులో దినమార్కెట్ కోసం నిర్మించిన కట్టడం ఇంతవరకు ప్రారంభానికి నోచుకోక పోవడమే ఏపీఎంసీ అధ్వాన స్థితికి అద్దం పడుతోంది. దిన మార్కెట్ ప్రారంభం కాకపోవడంతో శిథిలమైన ఇనుప కంబీలకు గోనె సంచులు కట్టుకు చిన్నచితక వ్యాపారులు నిత్యం సమస్యలతో కొట్టుమిట్టాతున్నారు. ఇక వర్షం వస్తే మార్కెట్ మరింత దుస్థితిగా మారిపోతోంది. మార్కెట్‌కు తెచ్చిన కూరగాయలు వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. సండూరు మార్కెట్ అభివృద్ధి కోసం 2023-24 సంవత్సరంలో జిల్లా ఖనిజ నిధి నుండి రూ.2కోట్ల రూపాయలు ఖర్చుచేసి దిన మార్కెట్, వే బ్రిడ్జి, సామూహిక మరుగుదొడ్లు నిర్మించిన ఒకటిన్నర సంవత్సరం గడిచినా ఇంతవరకు ప్రారంభం కాకపోవడం విడ్డూరంగా ఉంది. రాత్రి వేళ కొత్తగా నిర్మించిన మార్కెట్‌లో అసాంఘీక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయి. మార్కెట్‌కు వచ్చే వ్యాపారుల కోసం నిర్మించిన చిన్నపాటి ట్యాంకుల్లో ఒకటి శిథిలం కాగా, మరో దాంట్లో నీళ్ళురావు... నీటికోసం బయట హోటళ్ళ నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాపారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సండూరు పురసభ అధికారులు మౌలిక సౌకర్యాలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ఏపీఎంసీ ఆవరణంలో 2017-18 సంవత్సరంలో కేకేఆర్‌డీబీ నిధుల క్రింద రూ 95లక్షలు వెచ్చించి నిర్మించిన అంగళ్ళు కొన్ని మాత్రమే ఉపయోగంలో ఉండగా, మిగిలిన వ్యాపారస్తులకు కల్పించక పోవడంతో పాడుపడ్డాయి. జాతీయ వికాస యోజ క్రింద నిర్మించిన రైతుల కోసం నిర్మించిన గోడౌన్‌లు కూడా నిరుపయోగంగా మారగా, ఆహార పౌరసరఫరా అధికారులు వాటిని పీడీఎస్ బియ్యాన్ని నిలువ చేసేందుకు ఉపయోగిస్తున్నారు. సండూరు ఏపీఎంసీ మార్కెట్ ప్రాంగణం విశాలంగా ఉన్నా... దాని నిర్వహణ లేకపోవడంతో ఆదివారం మార్కెట్‌కు వచ్చే కాయగూరలు, పండ్లు, బట్టలు, ధన్యాలు సండూరు-కూడ్లిగి రాష్ట్ర రహదారిలో పెట్టుకుని అమ్మాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డుపై వ్యాపారం ప్రమాదమని తెలిసినా... అనివార్య పరిస్థితిలో రోడ్లపై పెట్టి అమ్ముకోవాల్సి వస్తోందని వ్యాపారాలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



విరిగిన షెడ్ల కిందే వ్యాపారాలు..

'యువ నిధి'కి నమోదు చేసుకోండి: కలెక్టర్

బళ్లారి సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హామీ పథకాల్లో ఒకటైన యువనిధి యోజన కింద జిల్లాలో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ అభ్యరుల నమోదుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టను న్నట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ కాలేజీ ఎడ్యుకేషన్ శాఖ సహకారంతో బుధవారం నుంచి జనవరి 20వ తేదీ వరకు విజయనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ క్యాంపస్‌లోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజ్ కార్యాలయంలో, బళ్లారిలోని పాత తాలూకా ఆఫీస్ క్యాంపస్‌లో యువనిధి పథకానికి ప్రత్యేక నమోదు ఏర్పాటు చేపట్టామన్నారు. 2023-24, 2024-25 సంవత్సరాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, డిప్లమా కోర్సుల్లో ఉత్తీర్ణులైన జిల్లాలోని అర్హులైన అభ్యర్థులందరూ అవసరమైన పత్రాలతో నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు రూ.3000 , డిప్లమా పాసైన అభ్యర్థులకు రూ.1500 నిరుద్యోగ భృతి అందజేస్తుందన్నారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఆందోళన వద్దు..
అప్రమత్తంగా ఉండాలి : డీహెచ్ఓ



జిల్లా వైద్యాధికారి రమేష్‌బాబు

బళ్లారి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): హ్యూమన్ మోటాప్‌న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) అంత ప్రాణాంతక మేమీ కాదని, కాకపోతే అప్రమత్తంగానే ఉండాలని డీహెచ్ఓ రమేష్ బాబు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్యశాఖ అధికారులకు పలు సూచనలు చేసిందన్నారు. ఏవైనా ఇబ్బంది ఉన్న రోగులతో నమూనాలు సేకరించి పరిక్షలు చేయాలన్నారు. బళ్లారి, విజయనగర. కొప్పళ, రాయచూరు, ఇలా అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట్ల అంబులెన్స్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అయితే గుంపులు గుంపులుగా తిరగడం, మాస్కులు లేకుండా తిరగడం మంచిది కాదన్నారు.

డ్రైవింగ్‌పై అవగాహన

బళ్లారి సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. మంగళవారం సండూరు తాలూకాలోని సిద్దాపూర్ సుశీలానగర్ మధ్యలో లారీ , బైక్ ఢీకొన్నప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన ఇద్దరు వ్యక్తులకు రైతు సంఘం నివాళి అర్పించారు. అనంతరం రైతు సంఘం ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో రైతు సంఘం గ్రామ యూనిట్ గౌరవాధ్యక్షుడు పీసీ పరమేశ్వర్, అధ్యక్షుడు పి.మంజునాథ్‌పాటిల్, పంపాపతి, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.తిప్పేస్వామి, నర్సింగాపూర్ గ్రామ యూనిట్ నాయకులు నీలకంతప్ప, అధ్యక్షుడు కుమారస్వామి, టి.మరియమ్మ,మంతమ్మ,సిద్దలింగప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై కఠిన చర్యలు: కలెక్టర్



ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశంలో కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జనవరి7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ వైద్యులపై కర్ణాటక ప్రైవేట్ వైద్య సంస్థల చట్టం 2007 ప్రకారం జరిమానాలు విధించాలని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేపీఎంఈ చాక్ట్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్ హాల్లో జరిగిన కర్ణాటక ప్రైవేట్ వైద్య సంస్థల చట్టం కేపీఎం చట్టం రిజిస్ట్రేషన్, లోటు నివారణ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో అధికృత మెడికల్ డిగ్రీలేని వారి ఇళ్ళు, దుకాణాలు, ఇతర భవనాలపై ఆరోగ్యశాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. నకిలీ వైద్యులకు భవనాన్ని అద్దెకు ఇచ్చే యజమానిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి లేదా జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే నకిలీ వైద్యులని తేలితే కర్ణాటక ప్రైవేట్ వైద్య చట్టం 2007 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే సందర్భంలో బళ్లారి తాలూకా జాలిబెంచి గ్రామంలో వైద్యం చేస్తున్న నకిలీ వైద్యుడు బసవరాజ్, మోకా పోలీస్‌స్టేషన్‌లో రాజన్న, రె హమాన్, షేక్షావలి, గురుప్రకాశ్, మహదేవ్ తదితరులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ఆదేశించారు. సిరుగుప్ప తాలూకాలోని కే.సుగూరు గ్రామంలోని బెంచి క్యాంపునకు చెందిన చంద్రశేఖర్‌కు మొత్తం ఆరుగురిపై రూ. లక్ష జరిమాన విధించాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు , కుటుంబ సంక్షేమ కార్యక్రమ సమన్వయకర్త డా.పూర్ణిమ, జిల్లామలేరియా నియంత్రణ అధికారి అబ్దుల్లా, జిల్లాక్షయనిర్మూలన అధికారి ఇంద్రాణి, జిల్లాకుష్టువ్యాధి నిర్మూలన అధికారి వీరేంద్రకుమార్, ఐఎంఏ అధ్యక్షుడు మాణిక్‌రావు, డా.శివకుమార్, మేనేజర్ విజయలక్ష్మి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై నిర్లక్ష్యం వద్దు

● అధికారులతో డిప్యూటీ కలెక్టర్ జుబేర్



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటల సాగు అనుభవం ఆదారంగా పంటల భీమా కంపెనీలు భీమా మెత్తాన్ని నిర్ణయిస్తారని, సరైన పద్దతిలో ప్రయోగాలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించరాదని డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేర్ అన్నారు. మంగళవారం జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేస్వాన్ వీడియో హాల్లో పంట కోత ప్రయోగాల ప్రగతి సమీక్ష, జనన మరణ పౌర నమోదు విధానం, పంటపొలాల పునరుద్దరణ తదితర అంశాలపై ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పంటల భీమా స్థానికంగా నిర్వహించబడే పంట కోత ట్రయల్స్‌పై ఆధారపడి ఉంటుందన్నారు. ఇందులో ఎలాంటి పొరపాటు ఉండకూడదని, లెక్కలు తప్పుకాకుండా ప్రయోగానికి సంబందించిన వివరాలను ఆయకట్టులో నింపాలన్నారు. జననమరణాల నమోదు ప్రక్రియలో సమాచారదారుడి పేరు. ఇతర సమాచారాన్ని సక్రమంగా సేకరించి నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు, జనాభలెక్కల అధికారి బసప్ప మాట్లాడుతూ జనన మరణాల నమోదు ప్రక్రియ విభాగం గురించి సమావేశంలో సమాచారం అందించారు. ఈకార్యక్రమంలో అన్ని తాలూకాల తహశీల్దార్లు, జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళలను కాపాడుకోవడం అందరి బాధ్యత

బళ్లారి సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మనపూర్వీకులు అనేక కళలను మనకందించారని, వాటిని కాపాడుకోవడం అందరి బాధ్యత అని కాంట్రాక్టర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ మసీదుపూర్ అన్నారు. మంగళవారం నగరంలోని దొడ్డనగౌడరంగమందిరంలో జిల్లా కళాకారుల సంఘం నిర్వహించిన బళ్లారి కళావైభవం కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాకారులు వారి కళాత్మక ప్రతిభను ప్రోత్సహించడానికి కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా కొట్రప్ప, కన్నడ సాహిత్య పరిషత్ జిల్లాధ్యక్షుడు నిష్టిరుద్రప్ప, కళాకారుల గురించి మాట్లాడారు. పురవర్గ మఠం అజాత శంబులింగ శివచార్యస్వామి. కోశాధికారి రమణప్ప భజంత్రీ. వీరేశ్ దళవాయి, కళాకారుల సంఘం అధ్యక్షుడు యల్లనగౌడ శంకర బండె, వివిధ రంగాల్లో విజేతలను సత్కరించారు.

విద్యార్థులు పట్టుదలతో ముందుకెళ్లాలి

కంప్లి, జనవరి 7(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు పట్టుదల, దీక్షతో ముందుకెళితే సాధించనిది ఏదీ లేదని కంప్లి తాలుకా శిక్షణ అధికారి సిద్దలింగమూర్తి తెలిపారు. మంగళవారం ఆకస్మికంగా తాలుకా పరిధిలోని దేవలాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసం కోసం ప్రభుత్వాలు ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నాయి. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. తరగతి గదులు, కంప్యూటర్, ఇతర వాటిని కూడా పరిశీలించారు. పలు సౌకర్యాలపై విద్యార్థులతో ఆరా తీశారు. వారితో పాటు సీఆర్పీ వీరేష్, ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్‌లు వున్నారు.



రికవరీ ఆభరణాలను బాధితులకు అప్పగిస్తున్న పోలీసులు

రూ. 1.91 కోట్ల సొమ్ము రికవరీ

● మూడేళ్లలో రూ.4కోట్లకు పైగా వస్తువుల చోరీ
● 39 శాతం రికవరీ.. త్వరలో మరిన్ని: ఎస్పీ

బళ్లారి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన వివిధ రకాల చోరీలు, దోపిడీలు, మోసాలు, దగా కేసుల్లో కోటి 91లక్షల 14వేల 613 రూపాయల బంగారు, వెండి, ద్విచక్రవాహనాలు, ల్యాబ్ ల్యాబ్‌లు, సెల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు బళ్లారి జిల్లా ఎస్పీ శోభారాణి తెలిపారు. మంగళవారం ఎస్పీ శోభారాణి ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీపీ) లోకేష్‌కుమార్ , ఏఎస్పీ నవీన్‌కుమార్ లతో కలిసి మంగళవారం ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 20 పోలీస్టేషన్లలకు గాను 18 పోలీస్ స్టేషన్లలో అందిన ఫిర్యాదులు ప్రకారం రికవరీ చేశామన్నారు. దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను ఆయా స్టేషన్ల వారీగా పరిశీలించి యజమానులకు అప్పజెప్పామన్నారు. గడిచిన మూడు సంవత్సరాల కాలంలో జిల్లా పరిధిలో మొత్తం వివిద కేసుల్లో 349 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిలో 109 కేసుల్లో నేరగాళ్లను గుర్తించి 83 మందిని కోర్టులో హాజరు పరిచామన్నారు. 2563.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 7735 గ్రాములు వెండి. 95 ద్విచక్రవాహనాలు, 2 సెల్‌ఫోన్లు, 2 ల్యాబ్‌ట్యాబులు, ఇతర వస్తువులు మొత్తం రూ. 1,91,14,613 విలువైన వస్తువులు రికవరీ చేసినట్లు తెలిపారు. వీటిని కోర్టు అనుమతితో బాధితులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ కార్యాలయ ఆవరణంలో వీరికి అప్పగించారు. జిల్లాలో ఉన్నఆయా పోలీస్టేషన్లు నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, హెచ్‌కానిస్టేబుళ్లు, పోలీసులు హజరయ్యారు.



'నీట్'లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న పాలక మండలి

శ్రమ, పట్టుదలతో విజయం సాధ్యం

●విశ్రాంత న్యాయమూర్తి బసవరాజ్ ఎస్
● అట్టహాసంగా జ్ఞానామృత ఉన్నత పాఠశాల వార్షికోత్సవం
●'నీట్' ప్రతిభావంతులకు పురస్కారాలు

బళ్లారి సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సరైన ప్రణాళిక, పట్టుదల శ్రమ తోడుగా ఉంటే విద్యలో ఉన్నత స్థానాలు లభించడం ఖాయమని విశ్రాంత న్యాయమూర్తి బసవరాజ్ ఎస్ అన్నారు. బళ్ళారి నగరం బెంగళూరు బైపాస్ రోడ్డు జ్ఞాన నగర్ ప్రధాన వక్తగా కార్కళ జ్ఞానసుధా శిక్షణ సంస్థ అధ్యక్షుడు జ్ఞానామృత విద్య సంస్థ బళ్ళారి అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ సుధాకర్ శెట్టి మాట్లాడారు. విద్య బోధనతో పాటు నైతికత గురించి నేటితరం విద్యార్థులకు బోధించాల్సిన అనివార్యత ఉందన్నారు. ఈ విషయంలో కార్కాళ జ్ఞానసుధా విద్య సంస్థ చేస్తున్న కృషి గురించి వివరించిన ఆయన అదే మార్గంలో బళ్ళారికి చెందిన జ్ఞానామృత విద్యా సంస్థలోనూ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాట్లాడిన మర్చెడ్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంజీ గౌడ పారిశ్రామిక వేత్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యల గురించి వివరిస్తూ విద్యావంతులు అన్ని రంగాలకు సంబంధించిన లాభనష్టాలను కష్టసుఖాలను అవగాహన కల్పించుకోవాలన్నారు. అనంతరం జాతీయ స్థాయి 'నీట్' పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించిన ఆయన ప్రస్తుతం అవార్డు అందుకున్న వారు భవిష్యత్తు తరం విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఎంచుకున్న మార్గంలో పట్టుదలతో శ్రమించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని తద్వారా తమకు విద్యనందించిన విద్యాసంస్థలకు, తల్లిదండ్రులకు ఈ ప్రాంతానికి కీర్తి ప్రతిష్టలు సాధించి పెట్టాలని ఆకాంక్షించారు.

9న విజయనగరం జిల్లా బంద్



పోస్టర్లు విడుదల చేస్తున్న రాజ్యాంగ పరిరక్షణ కమిటీ సభ్యులు

బళ్లారి సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యసభలో అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడడం తగదని, దీనికి నిరసనగా జనవరి 9న విజయనగరం జిల్లా బంద్ నిర్వహించనున్నట్లు రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ప్రకటించింది. మంగళవారం హొస్పేట్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ నాయకులు జంబయ్యనాయక్ మాట్లాడుతూ..... ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యసభలో అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జనవరి నిర్వహించనున్న బంద్‌కు అన్ని సంఘాలు మద్దతు తెలిపి విజయవంతం చేయాలన్నారు. రామకృష్ణనింబల్, సోమశేఖర్.డి.వెంకటరమణ, కరియప్ప గుడిమనె, వెంకటేశ్, సంతోష్ , తాయప్పనాయక్ వాసు పాల్గొన్నారు.

దాడి కేసులో న్యాయం చేయాలి



మాట్లాడుతున్న విద్యార్థి బంధువులు, దాడికి గురైన హనుమంతు

బళ్లారి గాంధీనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థిపై అన్యాయంగా దాడి చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని బాధితులు వాపోయారు. మంగళవారం బళ్ళారిలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో దాడికి గురైన విద్యార్థి హనుమంతు తల్లి, కుటుంబ సభ్యులు మాట్లాడారు. గుత్తిగనూరు రామాంజిని మాట్లాడుతూ గుత్తిగనూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద అన్న కుమారుడు హనుమంతుపై హొన్నప్ప, పంపాపతి అనే ఇద్దరు యువకులు దాడి చేశారన్నారు. వృద్ధుడు హనుమంతప్పపై దాడికి పాల్పతుండడాన్ని చూసిన విద్యార్థి హనుమంతు వారిని అడ్డుకున్నారు. దీంతో వారు పైశాచికంగా దాడి చేసి పారిపోయారన్నారు. హనుమంతుకు దెబ్బలు బాగా తగిలాయని, గొంతును బలంగా నొక్కిపెట్టడంలో మాట్లాడ లేక పోతున్నాడని, మోకాళ్ళపై బలమైన దెబ్బలు తగాలయాని డాక్టర్ల తెలపడంలో అదనపు చికిత్స కోసం బళ్ళారిలో ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో ఉన్న హనుమంతు తల్లితండులు కొడుకుపై జరిగిన దాడికి జీర్ణించుకోలేక పోతున్నట్లు తెలిపారు. డిసెంబరు 30వ తేదీన కురుగోడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అయితే ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. మార్చి నెలలో జరిగే 10వ తరగతి పరీక్షలకు హాజరు కాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో బాలి తల్లి తనకు ఉన్న ఒక్కగానొక్క కొడుకు కళ్ళ ముందు నడవలేనిస్థితిలో ఉండడాన్ని చూసి తట్టుకోలే పోతున్నట్లు మీడియా మందు కన్నీళ్ళు పెట్టుకుంది. జిల్లా ఎస్పీ తమ ఆవేదనను అర్థం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

హోసూరు జోన్



సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హోసూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ సిల్క్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సదస్సు హోసూరులో జరిగింది. సంఘం అధ్యక్షుడు దురై అధ్యక్షత వహించారు. తమిళనాడు ప్రభుత్వ పట్టు అభివృద్ధి శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్ సాగమూరి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీసులో చేరిన రోజును పరిగణనలోకి తీసుకుని సెలెక్షన్ గ్రేడ్, స్పెషల్ గ్రేడ్ సహ పదోన్నతులు కల్పించాలని కోరుతూ చేసిన నిరసనలకు స్పందించి కోర్టు తీర్పు వచ్చి నాలుగేళ్ల గడుస్తున్నా తమిళనాడు ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలు ఆందోళనలు చేసినా తమిళనాడు ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పట్టు అభివృద్ధిశాఖలో సుమారు 40 ఏళ్లుగా పనిచేసి పదవీ విరమణ పొందిన వారికి ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు అందకుండా పంపించేశారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల పదవీ విరమణకు కనీసం రూ.2 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉన్న ఉద్యోగులకు, పదవీ విరమణ పొందిన వారికి ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. జీతాలు పెంచాలని కోరుతూ సుప్రీం కోర్టు వరకు పోరాడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సీనియర్ సిటిజన్ల ఆధారంగా పెన్షనర్లకు అందాల్సిన అన్ని ప్రయోజనాలను అందించాలని సమావేశంలో 23 తీర్మానాలు చేశారు. సంఘ కార్యవర్గ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు

హోసూరు(క్రైం), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భార్యను చంపిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హోసూరు సమీపాన బాగలూరు సూడాపురం పెరియార్ నగర్‌లో నివాసముంటున్న పెయింటర్ ఆనంద కుమార్(40) కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య కల్పనను హతమార్చాడు. ఈనెల 4న కల్పనను బ్లేడుతో గొంతుకోసి హత్య చేశాడు. దీన్ని గమనించిన వారి కుమారుడు చేతన్ కుమార్ స్థానిక బాగలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పరారీలో ఉన్న ఆనందకుమార్‌ను ఇచ్చంగూరు ప్రాంతంలో ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ నేతృత్వంలో స్పెషల్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు.



భార్యాభర్తలు (ఫైల్)

నగరంలో రహదారుల ఆధునికీకరణ : మేయర్



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సత్య

హోసూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లో రూ.87 కోట్లతో మొత్తం 45 వార్డుల పరిధిలో రోడ్లను ఆధునీకరించనున్నట్లు మేయర్ సత్య తెలిపారు. హోసూరు మునిసిపల్ కార్పొరేషన్ సమావేశంలో 38మంది సభ్యులు పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలో రోడ్ల మరమ్మతులకు సంబంధించిన ప్రణాళికను ప్రభుత్వానికి పంపగా రూ.2.76కోట్లతో తాగునీటి సదుపాయం, రూ.8కోట్లతో రోడ్డు మరమ్మతులు చేశామన్నారు. మేయర్ మాట్లాడుతూ రూ.578 కోట్లతో చేపట్టిన భూగర్భ మురుగునీటి పారుదల ప్రాజెక్టును తమిళనాడు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.ఎన్.నెహ్రూ గత వారం ప్రారంభించారన్నారు. హోసూరు కార్పొరేషన్‌లో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. డీఎంకే మాదేశ్వరన్ మాట్లాడుతూ హోసూరు బస్టాండుకు వచ్చే బస్సుల ప్రవేశ రుసుము వసూలు చేసిన కాంట్రాక్టర్ కార్పొరేషన్‌కు మొత్తాన్ని చెల్లించలేదన్నారు. గత 6 నెలలుగా బస్సులకు ఎంట్రి ఫీజు వసూలు చేయకపోవడంతో లక్షల రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. ఇక మున్సిపల్ అధికారులు ద్వారా వసూలు చేయాలని డిమాండ్ చేశారు. హోసూరు కార్పొరేషన్ పరిధిల్లోని అనుమేపల్లి, అగ్రహారం పరిధిలోని 300కు పైగా కర్మాగారాలు గత 14 ఏళ్లుగా పన్నులు చెల్లించలేదన్నారు. కార్పొరేషన్ రూ.100 కోట్లకు పైగా ఆదాయాన్ని కోల్పోయిందన్నారు. హోసూరు కార్పొరేషన్ కార్యాలయంలోని శౌచాలయాలలో స్వచ్ఛత లేదన్నారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మంజుశ్రీనగర్‌కు మురుగు కాల్వ, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ కౌన్సిలర్ ఇంద్రాణి మాట్లాడుతూ హోసూరు కార్పొరేషన్‌లో విధించిన పన్నును వెంటనే రద్దు చేయాలి, ఇంటి పన్ను కూడా ఆలస్యంగా చెల్లించినందుకు జరిమాని విధించే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. శాంతినగర్ ప్రాంతంలో మురుగు కాల్వ, రోడ్డు సౌకర్యం కల్పించాలని తెలిపారు. అన్నాడీఎంకే శివరామన్ మాట్లాడుతూ మూకొండపల్లిలో తాగునీరు సైతం స్వచ్ఛంగా లేదని ఫిర్యాదు చేశారు.

ప్రత్యంగిరా దేవిని దర్శించుకున్న నటుడు యోగిబాబు

హోసూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): హోసూరు మోర్నపల్లి ప్రాంతంలోని ప్రసిద్ధి చెందిన రాహుకేతు అధర్వణ, మహా ప్రత్యంగిరా ఆలయాన్ని తమిళ నటుడు యోగిబాబు సందర్శించి పూజలు చేశారు. అనంతరం మహా కాల బైరవ సన్నిధానంలో ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వర్ణకవచ ధారణలో ప్రత్యంగిరా దేవి సన్నిధిలో అభిషేకం చేసి తీర్థం స్వీకరించారు. అనంతరం సినీనటుడుతో కలసి స్థానిక భక్తులు ఫోటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నటుడు యోగిబాబును సత్కరిస్తున్న పూజారులు